

ఫేక్ రిజిస్ట్రేషన్‌పై..

ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. 10లో▸



ఉన్నత ఫలితాలు సాధించాలి

విద్యావిధానంలో ఉన్నత ఫలితాలను సాధించాలని ఏఐసీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ టీజీ సీతారాం అన్నారు. 10లో▸



భగీరథ.. నీటి వృథా!

చేవెళ్ల మండలం పామెన సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీక్ అయింది. దీంతో తాగునీరంతా వృథాగా పోయింది. 10లో▸

న్యూస్‌రీల్

మార్షల్ ఆర్ట్స్ ఇండియా కన్వీనర్‌గా చెన్నయ్య



నియామకపత్రం అందుకుంటున్న చెన్నయ్య

షాద్‌నగర్: ఆల్‌స్టైల్ మార్షల్ ఆర్ట్స్ ఇండియా కన్వీనర్‌గా షాద్‌నగర్ పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ ఎత్తిన చెన్నయ్య ఎన్నికయ్యారు. హైదరాబాద్‌లో గురువారం మార్షల్ ఆర్ట్స్ ఆల్‌స్టైల్ ఇండియా కమిటీ సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా చెన్నయ్యకు మార్షల్ ఆర్ట్స్ కరాటే ఆల్ ఇండియా చైర్మన్, సినీ నటుడు సుమన్ నియామకపత్రం అందజేశారు.

ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు



మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్‌ను సన్మానిస్తున్న ప్రిన్సిపాల్ శోభారాణి

శంకర్‌పల్లి: ప్రభుత్వం ప్రైవేటుకు దీటుగా సర్కారు బడుల్లో చదివే విద్యార్థుల కోసం ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని మోడల్ స్కూల్స్ డిప్యూటీ డైరెక్టర్ దుర్గాప్రసాద్ అన్నారు. పాఠశాలల పునః ప్రారంభం సందర్భంగా గురువారం శంకర్‌పల్లి మోడల్ స్కూల్‌లో నిర్వహించిన పేరెంట్ టీచర్స్ మీటింగ్‌కు ఆయన మండల విద్యాధికారి అక్బర్‌తో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని, నిత్యం బడికి వచ్చేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు యూనిఫాం, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ యోగేశ్, ప్రిన్సిపాల్ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించండి



చిన్నారులకు అందిస్తున్న ఆహారాన్ని పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ శ్రీలత

యాచారం: ఐదేళ్ల లోపు చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని డీఆర్‌డీఓ శ్రీలత సూచించారు. మండల పరిధిలోని గునుగల్‌లో గురువారం అమ్మమాట.. అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు ఎంతో ఉల్లాసంగా ఉంటారని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అందించే పౌష్టికాహారం, ఆటపాటలతో విద్య, గర్భిణులకు అందించే సేవలపై ఐసీడీఎస్ సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇబ్రహీంపట్నం ఐసీడీఎస్ సీడీపీఓ వినీత, ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలజ, సెర్ప్ ఏపీఎం సాంబశివుడు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



కొందుర్గులోని ఫెర్టిలైజర్ షాపులో విత్తనాలు పరిశీలిస్తున్న డీఏఓ నర్సింహారావు

కొందుర్గు: విత్తనాలు, ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు హెచ్చరించారు. మండల కేంద్రంతోపాటు, రామచంద్రాపూర్ గ్రామంలోని ఎరువులు, విత్తనాల దుకాణాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విత్తనాలు, ఎరువుల స్టాకు వివరాలు, స్టాక్ బుక్‌లో నమోదు వివరాలను పరిశీలించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులకు నాణ్యమైన విత్తనాలు విక్రయించాలని, విధిగా రసీదులు ఇవ్వాలని సూచించారు. రైతులు యూరియా మోతాదు తక్కువగా వాడేలా అవగాహన కల్పించాలన్నారు. ఆయన వెంట ఏఓ సురేష్ రెడ్డి ఉన్నారు.

వ్యవసాయం అవసరం

షాబాద్: వ్యవసాయం గ్రామీణ జీవనోపాధికి ఎంతో అవసరమని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఏవో వెంకటేశం, శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: రాందాస్‌పల్లిలో బడికి వస్తున్న చిన్నారులకు పూలు ఇచ్చి స్వాగతం పలుకుతున్న ఉపాధ్యాయులు



కందుకూరు: పులిమామిడిలోని కేంద్రీయ పాఠశాలకు వస్తున్న విద్యార్థులు

సెలవులకు టాటా.. విద్యార్థుల బడిబాట

బడిగంట మోగింది. వేసవి సెలవులకు విద్యార్థులు టాటా చెప్పేశారు. గురువారం బ్యాగులు భుజాన వేసుకుని బడిబాట పట్టారు. పాఠశాలలు పునఃప్రారంభమైన వేళ ఎక్కడ చూసినా సందడి వాతావరణం నెలకొంది. పలు చోట్ల మామిడి ఆకులు, పూల తోరణాలు కట్టి ఉపాధ్యాయులు విద్యార్థులకు స్వాగతం పలికారు. పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, యూనిఫాంలు అందించారు. మెనూ ప్రకారం మధ్యాహ్నం భోజనం వడ్డించారు. మొదటి రోజు కావడంతో హాజరు శాతం తక్కువగా కనిపించింది.



చేవెళ్ల: జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల గేట్‌వద్ద చెరువును తలపిస్తున్న వర్షపు నీటిలో నుంచి విద్యార్థులను బైక్‌పై తీసుకెళ్తున్న తండ్రి



కడ్తాల్: బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పరమాన్నం వడ్డిస్తున్న సిబ్బంది



కొత్తూరు: విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం పంపిణీ చేస్తున్న ఉపాధ్యాయులు

మంత్రి అడ్లూరిని కలిసిన చేవెళ్ల ఎమ్మెల్యే



చేవెళ్ల: మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన ఆయనను గురువారం నగరంలోని మినిస్టర్ క్వార్టర్స్‌లో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకుడు కృష్ణారెడ్డి ఉన్నారు.

‘పట్నం’లో భారీ వర్షం



ఇబ్రహీంపట్నం: భారీ వర్షం ఇబ్రహీంపట్నంను ముంచెత్తింది. గురువారం మధ్యాహ్నం 40 నిమిషాల పాటు ఏకధాటిగా దంచి కొట్టింది. 24.8 మి.మీటర్ల వర్షపాతం నమోదైంది. రోడ్లన్నీ జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ వాహనాలు నిలిచిపోయాయి. మండల పరిధిలో సాయంత్రం 6 గంటలకు నమోదైన సగటు వర్షపాతం 11.8 మి.మీటర్లుగా ఉంది. దండు మైలారం, ఎలిమినేడులో 11.3 మి.మీటర్ల చొప్పున కొంగరకలాన్ కలెక్టరేట్ పరిధిలో 5.8 మి. మీ., మంగల్‌పల్లి పరిధిలో 0.3 మి.మీ వర్షం కురిసింది.

మైనార్టీల సంక్షేమానికి ప్రాధాన్యత

- మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్



ముస్లిం మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఒబేదుల్లా కొత్వాల్, ఎమ్మెల్యే కసిరెడ్డి

ఆమనగల్లు: ముస్లిం మైనార్టీల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్ అన్నారు. పట్టణంలోని కళ్యాణి గార్డెన్స్‌లో గురువారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ ద్వారా ఆమనగల్లు, మాడ్గుల, తలకొండపల్లి, కడ్తాల మండలాలకు చెందిన 167 మంది మైనార్టీ మహిళలకు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డితో కలిసి కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఒబేదుల్లా కొత్వాల్ మాట్లాడుతూ.. మైనార్టీ కార్పొరేషన్ ద్వారా వివిధ పథకాల కింద దాదాపు లక్ష మైనార్టీ కుటుంబాలకు లబ్ధి చేకూరుస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 43 వేల మంది మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. వితంతు, విడాకులు పొందిన, ఒంటరి ముస్లిం మహిళలు 5 వేల మందికి రూ.50 వేల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో గుర్తించిన వెయ్యిమంది సంచార ముస్లిం కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.లక్ష చొప్పున సాయం అందిస్తున్నట్లు వివరించారు. యువ వికాసం పథకం కింద 45 వేల మంది ముస్లింలకు రూ.850 కోట్లు అందించనున్నట్లు ఆయన తెలిపారు. 6 వేలమంది ముస్లిం మైనార్టీ విద్యార్థులకు వృత్తి నైపుణ్య శిక్షణ ఇప్పించి ఉపాధి చూపుతున్నట్లు చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. అంతకుముందు 41 మందికి కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆమనగల్లు మార్కెట్ చైర్మన్ గీత, వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, పీసీసీ సభ్యుడు అయిల శ్రీనివాస్‌గౌడ్, మార్కెట్ మాజీ చైర్మన్ కిషన్‌రెడ్డి, మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, చెంచు యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మండ్లి రాములు, మైనార్టీ సంక్షేమ శాఖ డీఎం నవీన్‌రెడ్డి, తహసీల్దార్‌లు లలిత, ముంతాజ్, నాగార్జున, ఎంపీడీఓ మాధురి, మండల ప్రత్యేకాధికారి శోభారాణి, మున్సిపల్ కమిషనర్ శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



ఎరువులు గోదాంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

రైతులకు ‘సహకారం’ అందించాలి

- ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి

అబ్దుల్లాపూర్‌మెట్: ప్రతి రైతుకూ మేలు చేసేలా సహకార సంఘాలు పని చేయాలని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని బాటసింగారం రైతు సేవా సహకార సంఘం ఆవరణలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన ఎరువుల గోదాంను సహకార సంఘం చైర్మన్ చేగూరి భరత్‌కుమార్, గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డితో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రైతులకు తెలియజేయాలని సూచించారు. సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. చైర్మన్ భరత్ కుమార్ మాట్లాడుతూ.. గడిచిన 14 నెలల్లో సంఘం పరిధిలోని రైతులకు రూ.31 కోట్ల మేర వివిధ రకాల రుణాలు అందించినట్టు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సహకార సంఘం అసిస్టెంట్ రిజిస్ట్రార్ విజయ, సంఘం వైస్ చైర్మన్ నార్లకొండ మల్లమ్మ, హయత్‌నగర్ సింగిల్ విండో చైర్మన్ చామ కృష్ణారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భాస్కర్‌చారి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

శానిటేషన్ కార్మికుల భద్రత ముఖ్యం



బడంగ్‌పేట్: కార్యక్రమంలో పాల్గొన్న సీడీఎంఏ డైరెక్టర్ సంధ్య తదితరులు



ఇబ్రహీంపట్నం: పారిశుద్ధ్య పనులు పరిశీలిస్తున్న సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న

- సీడీఎంఏ డైరెక్టర్ సంధ్య

బడంగ్‌పేట్: శానిటేషన్ కార్మికులు, సిబ్బంది కోసం భద్రత నైపుణ్యాలు, సామాజిక రక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆయుష్మాన్ భారత్ (హెల్త్‌కార్డు)ను సద్వినియోగం చేసుకోవాలని సీడీఎంఏ డైరెక్టర్ బి.సంధ్య కోరారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో భాగంగా గురువారం మున్సిపల్ కమిషనర్ పి.సరస్వతి, నవజీవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీడీఎంఏ డైరెక్టర్ సంధ్య మాట్లాడుతూ.. శానిటేషన్ కార్మికుల రక్షణ, భద్రత, చాలా ముఖ్యమని అన్నారు. కార్మికుల నైపుణ్యాలను పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఎంసీ శ్యామ్‌సుందర్, డీఈఈ వెంకన్న, ఆర్వో వేణుగోపాల్‌రెడ్డి, మేనేజర్ నాగేశ్వర్‌రావు, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ వంకాయల యాదగిరి, మెప్మా శంకర్, ఈఈ మౌనిక, వార్డు ఆఫీసర్లు, శానిటేషన్ సిబ్బంది, ఆర్పీలు పాల్గొన్నారు.

‘పట్నం’ మున్సిపాలిటీ సందర్శన

ఇబ్రహీంపట్నం: మున్సిపాలిటీలో వంద రోజుల ప్రణాళికలో భాగంగా చేపడుతున్న పనులను సీడీఎంఏ అసిస్టెంట్ డైరెక్టర్ జ్యోత్స్న గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తపై తీసుకుంటున్న చర్యలను మున్సిపల్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరిసరాల పరిశుభ్రత, పారిశుద్ధ్య మెరుగు పనులు, నర్సరీలో మొక్కల పెంపకానికి చేపడుతున్న కార్యక్రమాలను ఆమె స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్రసాగర్, సిబ్బంది ప్రవీణ్‌రెడ్డి, ప్రణవ్ తదితరులు ఉన్నారు.

బడి గంట మోగినా.. బండి బాగుపడలే..

- గ్రేటర్ పరిధిలో 1,825 బడిబస్సులు ఫిట్‘లెస్’
- సామర్థ్యం లేనివాటిపై రవాణా శాఖ కొరడా
- నగర వ్యాప్తంగా విస్తృతంగా తనిఖీలు
- మొదటి రోజు 40 బస్సుల జప్తు
- ప్రత్యేక బృందాలతో యంత్రాంగం నిఘా

సాక్షి, సిటీబ్యూరో: బడులు తిరిగి తెరుచుకొనే నాటికి సామర్థ్యం ఉన్న బస్సులను అందుబాటులో ఉంచాలనే నిబంధన మరోసారి ఉల్లంఘనకు గురైంది. సామర్థ్యంలేని బస్సులు వందల సంఖ్యలో రోడ్డెక్కాయి. స్కూల్ బస్సుల నిర్వహణపై రవాణాశాఖ ఆంక్షలు విధించినా.. కొన్ని విద్యాసంస్థలు నిర్లక్ష్యం చేస్తున్నాయి. గురువారం గ్రేటర్ పరిధిలోని రంగారెడ్డి, మేడ్చల్, హైదరాబాద్ జిల్లాల పరిధిలో నిర్వహించిన తనిఖీల్లో సామర్థ్యం లేని 40 బస్సులను జప్తు చేసినట్లు రవాణా శాఖ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ ఎం.చంద్రశేఖర్‌గౌడ్ తెలిపారు. ఫిట్‌నెస్ లేకుండా తిరిగే బస్సులను జప్తు చేయడంతో పాటు భారీ జరిమానాలను సైతం విధిస్తామని ఆయన హెచ్చరించారు.



స్కూల్ బస్సును తనిఖీ చేస్తున్న అధికారులు

ఏటా.. ఏదో ఒక చోట..

- ప్రతి సంవత్సరం ఎక్కడో ఒకచోట స్కూల్ బస్సులు ప్రమాదానికి గురవుతున్నాయి. అభం శుభం తెలియని చిన్నారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఆయా ఘటనల్లో బస్సుల సామర్థ్యం ప్రశ్నార్థకం కావడంతో పాటు డ్రైవర్ల నిర్లక్ష్యం కూడా ఉంటోంది. వాహనాలు నడిపే సమయంలో సరైన జాగ్రత్తలు పాటించడం లేదు. పరిమితికి మించిన వేగంతో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు కారణమవుతున్నారు.
- మరోవైపు బస్సు బయటి వైపు వెనుక, ముందు గమనించకుండా ముందుకు కదిలించడం వంటి ఘటనల్లోనూ చిన్నారులు బలవుతూనే ఉన్నారు. మరోవైపు నగర శివార్లలోని పలు విద్యాసంస్థలకు చెందిన వాటిలో కాలం చెల్లిన బస్సులే ఎక్కువగా ఉన్నాయి. సెకండ్‌హ్యాండ్ వాహనాలను కొనుగోలు చేసి వాటిని పిల్లల కోసం వినియోగిస్తున్నారు. ఆర్టీఏ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు చేసి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు ఇస్తున్నారనే ఆరోపణలున్నాయి. గ్రేటర్ పరిధిలో ఇప్పటికీ ఫిట్‌నెస్ లేనివి 1,825 బస్సులు ఉన్నాయి. మూడు జిల్లాల పరిధిలో మొత్తం 13,552 బస్సులు ఉండగా వాటిలో ఇప్పటి వరకు 11,727 బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించి సర్టిఫికెట్లు ఇచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఫేక్ రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలి



సంబంధిత పత్రాలు చూపిస్తున్న రైతు సత్యనారాయణ

శంకర్‌పల్లి: ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని తన భూమిని తనకు అప్పగించాలని బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. సంగారెడ్డి జిల్లా రామచంద్రపురానికి చెందిన సత్యనారాయణ 2006లో శంకర్‌పల్లి మండలం శేరిగూడలోని సర్వే నం. 119/అ లో 30గుంటల భూమిని నవరత్నరెడ్డి అనే వ్యక్తి నుంచి కొనుగోలు చేశాడు. 1995లో శేరిగూడ గ్రామానికి చెందిన కిష్టయ్య నుంచి హన్మంత్‌రెడ్డి, మరో ఇద్దరు స్నేహితులు ఈ భూమిని కొనుగోలు చేసి మ్యూటేషన్ చేసుకోలేదు. అనంతరం వారు ముగ్గురూ అమెరికా వెళ్లిపోయారు. ఆ భూమికి సంబంధించి జనరల్ పవర్ ఆఫ్ అటార్నీని హన్మంత్‌రెడ్డి తండ్రి అయిన నవరత్నరెడ్డి పేరు మీద 2006లో చేశారు. తర్వాత నవరత్నరెడ్డి 30గుంటల భూమిని 2006జూన్‌లో సత్యనారాయణకు విక్రయించాడు. అప్పటికే అప్రమత్తమైన కిష్టయ్య భూమి మ్యూటేషన్ చేసుకోలేదని తెలిసి, తన పేరు మీదనే భూమి ఉందని తెలుసుకొని తన కుమారుడి పేరు మీద చేశాడు. విషయం తెలుసుకున్న సత్యనారాయణ కోర్టుకి వెళ్లాడు. కోర్టు నోటీసులు జారీ చేసినా ఆ సర్వే నంబర్‌లో ఉన్న మరికొంత భూమిని అమ్ముతున్నాడని గురువారం రైతు సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశాడు. ఫోర్జరీ చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న వ్యక్తిపై చర్యలు తీసుకొని తన భూమిని తనకి అప్పగించాలని కోరుతున్నాడు.

విద్యుదాఘాతంతో పాడి పశువుల మృతి



పాడి పశువుల కళేబరాలు

కొందుర్గు: విద్యుదాఘాతంతో పాడి పశువులు మృతిచెందిన సంఘటన జిల్లేడ్ చౌదరిగూడ మండలంలోని జిల్లేడ్ గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మీదిగడ్డ రాఘవకు చెందిన ఒక గేదె, చించేటి సాయిలుకు చెందిన రెండు దూడలు, చించేటి ప్రభాకర్‌కు చెందిన ఒక ఆవు గురువారం పొలం వద్ద మేత మేస్తుండగా విద్యుదాఘాతానికి గురై మృత్యువాతపడ్డాయి. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతులు విజ్ఞప్తి చేశారు.

భగీరథ.. నీటి వృథా!



పైప్‌లైన్ లీకేజీతో ఎగిసి పడుతున్న నీరు

చేవెళ్ల: మండలంలోని పామెన సమీపంలో మిషన్ భగీరథ పైపులైన్ లీక్ అయింది. దీంతో తాగునీరంతా వృథాగా పోయింది. ప్రధాన పైపులైన్ కావటంతో నీరంతా ఒక్కసారిగా పైకి ఎగజిమ్మింది. సమాచారం అందుకున్న సంబంధిత సిబ్బంది వచ్చి సరఫరాను ఆపేశారు.

క్రికెట్‌లో సత్తాచాటిన గిరిజన విద్యార్థిని



మహేశ్వరి

షాద్‌నగర్ రూరల్: హైదరాబాద్‌లో నిర్వహించిన అండర్ 19 రాష్ట్ర స్థాయి మహిళా క్రికెట్ పోటీల్లో గిరిజన విద్యార్థిని మహేశ్వరి సత్తాచాటింది. గిరిజన సంక్షేమ గురుకుల కళాశాలలో డిగ్రీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న ఆమె మొదటి మ్యాచ్‌లో నాలుగు వికెట్లు, రెండో మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసి ఉత్తమ బౌలర్‌గా పురస్కారం అందుకుంది. గురువారం కళాశాల ప్రిన్సిపాల్ నీతాపోలే, అధ్యాపకులు మహేశ్వరిని అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దొంగ దొరికాడు

- ఉత్తర్‌ప్రదేశ్‌లో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నిందితుడిపై 30కిపైగా కేసులు



ఎస్‌ఐ అరుణ్‌తోపాటు సిబ్బందిని అభినందిస్తున్న ఎస్పీ నారాయణరెడ్డి



నిందితుడు నందులాల్ రాజ్‌బార్

నవాబుపేట: వ్యవసాయ క్షేత్రాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి, వాటిలోని రాగి తీగ, ఆయిల్‌ను దొంగిలిస్తున్న అంతర్రాష్ట్ర దొంగ నందులాల్ రాజ్‌బార్(35)ను నవాబుపేట పోలీసులు ఎట్టకేలకు పట్టుకున్నారు. 30 పైగా ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసిన కేసుల్లో ఇతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్లు ఉన్నాయి. వారం రోజుల పాటు శ్రమించిన పోలీసులు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం అజంగఢ్ జిల్లాలోని తన స్వగ్రామమైన చెన్నైలో నిందితుడిని అరెస్టు చేశారు. ఇతను గ్యాస్ వెల్డింగ్ పనులు చేసేవాడు. సులభంగా డబ్బు సంపాదించాలనే దురాశతో నేరాల బాట పట్టాడు. తన వృత్తిని అడ్డు పెట్టుకుని నిర్మానుష్య ప్రాంతాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను లక్ష్యంగా చేసుకుని అందులోని కాపర్, ఆయిల్‌ను దొంగిలించి సొమ్ము చేసుకునేవాడు. 2020–21లో నవాబ్‌పేట్ పీఎస్ పరిధిలో చేసిన పదికి పైగా కేసుల్లో అరెస్టయి జైలుకు వెళ్లాడు. అనంతరం బెయిల్‌పై బయటకు వచ్చి, వికారాబాద్ జేఎఫ్‌సీఎం కోర్టులో జరుగుతున్న విచారణకు హాజరు కాకుండా పరారీలో ఉన్నాడు. దీంతో న్యాయస్థానం అతనిపై నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నిందితున్ని పట్టుకుని వెంటనే తమ ముందు హాజరు పర్చాలని పోలీసులను ఆదేశించింది. దీంతో ఎస్పీ నారాయణరెడ్డి ఆదేశాల మేరకు నవాబ్‌పేట్ ఎస్‌ఐ అరుణ్ కుమార్, సిబ్బందితో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన నిందితుడు ఉత్తరప్రదేశ్‌లో ఉన్నట్లు పక్కా సమాచారం అందుకుని వారం రోజులుగా అజంగఢ్ జిల్లాలో మకాం వేశారు. స్థానిక పరిస్థితులను అధిగమించి, నిందితుడి కదలికలపై నిఘా పెట్టి, అత్యంత చాకచక్యంగా పట్టుకున్నారు. ఆపరేషన్‌ను విజయవంతంగా పూర్తి చేసిన ఎస్‌ఐ అరుణ్ కుమార్‌తో పాటు సిబ్బందిని ఎస్పీ అభినందించారు. నిందితుడిపై నవాబుపేట పీఎస్‌లో 10, క్పల్లి పీఎస్‌లో 16, మోమిన్‌పేట్ పీఎస్‌లో 3, ధారూరు, బంట్వారం పీఎస్‌ల పరిధిలో ఒక్కొటి చొప్పున కేసులు నమోదైనట్లు తెలిపారు. వీటితో పాటు సంగారెడ్డి, సైబరాబాద్, నల్గొండ, నిజామాబాద్, సూర్యాపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో కూడా ఈ తరహా కేసులు నమోదయ్యాయని స్పష్టంచేశారు. నిందితుడిని న్యాయస్థానంలో హాజరుపర్చి, మిగిలిన వారిని సైతం పట్టుకుంటామన్నారు.

విద్యా విధానంలో ఉన్నత ఫలితాలు సాధించాలి



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఏఐసీటీఈ చైర్మన్ సీతారాం

శంకర్‌పల్లి: భారతదేశం 2047 నాటికి ప్రధానమంత్రి మోదీ ఆశించినట్లుగా విద్యావిధానంలో ఉన్నత ఫలితాలను సాధించాలని ఏఐసీటీఈ (ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్) చైర్మన్ ప్రొ.టీజీ సీతారాం అన్నారు. దొంతాన్‌పల్లిలోని ఇక్ఫాయ్ డీమ్డ్ విశ్వవిద్యాలయంలో గురువారం నిర్వహించిన జాతీయ విద్యావిధానం 2020పై అంతర్జాతీయ సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాలుగేళ్ల క్రితం దేశంలో ప్రవేశపెట్టిన 'జాతీయ విద్యావిధానం 2020' అద్భుతంగా పని చేస్తోందని కొనియాడారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొనే ఈ విద్యావిధానం ప్రవేశపెట్టామని, దీనికి కేంద్ర ప్రభుత్వం ఏటా పెద్ద మొత్తంలో బడ్జెట్ కేటాయిస్తోందని వెల్లడించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీయడమే ఈ విద్యావిధానం ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా విద్యావిధానం మార్చుకోవడం ద్వారా వేర్వేరు ప్రాంతాల్లో బహుళ సంఖ్యలో విశ్వవిద్యాలయాలు వచ్చాయని, దీంతో విద్యార్థులు ఎంతో లబ్ధి పొందుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో మణిపాల్ అకాడమీ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చాన్సలర్ డా. ఎండీ వెంకటేశ్ ఆన్‌లైన్ ద్వారా, ఇక్ఫాయ్ వైస్ చాన్సలర్ ప్రొ. ఎల్ఎస్ గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆడుకోవడానికి వెళ్లి.. క్వారీ గుంతలో పడి..

ఇద్దరు చిన్నారుల మృతి



దుర్గప్రసాద్ (ఫైల్)



సుబ్రమణ్యం (ఫైల్)

జవహర్‌నగర్: క్వారీ గుంతలో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు పడి మృతి చెందారు. జవహర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాలు... జవహర్‌నగర్ అరుంధతినగర్‌లో యాదమ్మ కుటుంబసభ్యులతో కలిసి ఉంటోంది. యాదమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా పరామర్శించడానికి బంధువులు స్వాతి, అంజమ్మ, వారి కుమారులు దుర్గప్రసాద్(11), సుబ్రమణ్యం(8)లను తీసుకొని ఆమె ఇంటికి వచ్చారు. బుధవారం మధ్యాహ్నం ఆడుకోవడానికి బయటకు వెళ్లిన దుర్గప్రసాద్, సుబ్రమణ్యం ఆ తర్వాత కనిపించకపోవడంతో చుట్టపక్కల వెతికారు. ఎంతకూ వారి ఆచూకీ లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. గురువారం సాయంత్రం ఆ చిన్నారులు బండబావి క్వారీ గుంతలో శవాలై తేలారని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి వచ్చి మృతులను గుర్తించి వారి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాలను బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. కుమారులు మృతి చెందడంతో బాధిత కుటుంబాల రోదనలు మిన్నంటాయి.

బైక్‌ల దొంగకు కటకటాలు



పట్టుబడిన బైకులు, దొంగతో పోలీసులు

- 15 ద్విచక్ర వాహనాలు స్వాధీనం
- నిందితుడిపై 20కిపైగా కేసులు

తాండూరు టౌన్: బైకులు చోరీ చేస్తున్న అంతర్రాష్ట్ర దొంగను తాండూరు పట్టణ పోలీసులు చాకచక్యంగా పట్టుకున్నారు. ఏకంగా 15 బైకులను దొంగిలించిన నిందితుడు, ఇందులో 10 బైకులు విక్రయించి.. మరో బైక్‌పై దర్జాగా తిరుగుతుండగా ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. పట్టణ సీఐ సంతోష్ కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. యాలాల మండలం కమాల్‌పూర్ గ్రామానికి చెందిన బోయిని శ్రీకాంత్ ఆటో డ్రైవర్‌గా పని చేసేవాడు. బుధవారం స్థానిక విలియంమూన్ చౌరస్తా వద్ద ఎస్‌ఐ సాజిద్ తన సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సమయంలో బైక్‌పై వచ్చిన శ్రీకాంత్ పోలీసులను చూసి బైకు వదిలేసి పారిపోతుండగా, వెంబడించి పట్టుకున్నారు. అనంతరం తమ దైన శైలిలో విచారించగా అసలు విషయం బయటపెట్టాడు. జిల్లాలో చోరీ చేసిన 15 బైకుల్లో 10 బైకులను తాండూరు మండలం బిజ్వార్ గ్రామంలో పలువురికి విక్రయించినట్లు అంగీకరించాడు. మిగిలిన ఐదింటిలో నాలుగు బైకులను తన ఇంట్లో దాచి పెట్టి మరో బైకుపై దర్జాగా తిరుగుతున్నాడు. దీంతో రూ.7.50 లక్షల విలువైన 15 బైకులను స్వాధీనం చేసుకుని, గురువారం నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. అయితే గతంలో ఇతనిపై సైబరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 20 కేసుల వరకు నమోదయ్యాయి. వీటిలో పలు కేసుల్లో జైలుకు కూడా వెళ్లి వచ్చాడు. అయినా తీరు మార్చుకోలేదు. బైకు చోరీ కేసులను ఛేదించిన పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్‌ఐ సాజిద్, క్రైమ్ సిబ్బంది అమ్జద్, శివ, సాయప్ప, షబీల్‌ను ఎస్పీ నారాయణరెడ్డి అభినందించారు.

బిడ్డను కాపాడబోయిన ఘటనలో తండ్రి మృతి

వారం క్రితం కూతురు మృతి



మృతి చెందిన మహ్మద్ అలీ

సికింద్రాబాద్: ఆత్మహత్యకు పాల్పడేందుకు రైలు పట్టాలు ఎక్కిన కూతురిని కాపాడబోయిన తండ్రి గురువారం మృతి చెందాడు. ఈ ఘటన జరిగిన రోజే కూతురు మృతిచెందిన విషయం తెలిసిందే. వారం రోజులలోపే తండ్రి కూతురు మృతి చెందడం పాటిగడ్డలోని ఒక కుటుంబంలో తీరని విషాదాన్ని నింపింది. జీఆర్పీ హెడ్‌కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన మేరకు.. మహ్మద్‌అలీ (50)కూతురు ఆలియాబేగం (26) భర్త, అత్తింటి వారి వేధింపులు తాళలేక ఈనెల 7న సంజీవయ్య పార్కు రైల్వేస్టేషన్ సమీపంలోని రైల్వేట్రాక్ పై కూర్చుంది. తండ్రి పరుగున ట్రాక్ వద్దకు వెళ్లి కుమార్తెను వారిస్తున్న సమయంలోనే సికింద్రాబాద్ నుంచి నాంపల్లి వెళుతున్న లైట్ ఇంజిన్ రైలు వేగంగా వచ్చి వారిని ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆలియాబేగం అక్కడికక్కడే మృతి చెందింది. తీవ్రంగా గాయపడ్డ ఆమె తండ్రి మహ్మద్ అలీ గురువారం మృతి చెందాడు.

సాక్షి క్లాసిఫైడ్స్

Education

■ Last Chance 10th. Inter Direct Degree (Dist), BA, B.Com, B.Sc, BBA, BCA, BMLT, DMLT,B.Tech,Diploma MA,M.Com,M.Sc, MBA MCA Regular/ Lateral Entry Ph: 9490577501 [H-783377]

Real Estate

FLAT FOR SALE

■ New 2BHK Flat with Car Parking for Sale opp Prayer Power Church Ramnagar Contact: 9347886782 Prashanth. [HA-12488]

PLOT FOR SALE

■ శ్రీశైలం హైవేలో RRR దగ్గరలో DTCP లో ప్లాట్లు ఇప్పుడు 8,000 రూ॥ గల గజం ప్లాట్లు కేవలం 4,000 రూపాయలకు ఇవ్వబడును. Ph : 9177619716 [HA-15926]

■ శ్రీశైలం హైవే "4th City Future City" కి దగ్గర కడ్తాల్ టౌన్‌లో అప్రూవ్డ్‌తో 220 గ॥ ప్లాట్స్ కలవు. బ్యాంక్ లోన్, స్పాట్ రిజి॥ సైట్ విజిట్ సంప్ర : 9550805508 [HA-25004791]

■ "స్పెషల్ ఆఫర్" హైదరాబాద్-వరంగల్ హైవేలో వంగపల్లి దగ్గర హైవే ఫేసింగ్ వెంచర్లో గజం 10,000/- మాత్రమే DTCP విత్ రేరా నెంబర్ మరియు 80% బ్యాంక్ లోన్ సౌకర్యంతో ప్లాట్స్ కలవు. ఫిక్స్‌డ్ ప్రైస్, డైరెక్ట్ కంపెనీ సేల్ సంప్ర : 9515438614 [HA-1371]

■ VJA, మంగళగిరి, బందరు రోడ్డు, మచిలీపట్నం పోర్టు, బెంజిసర్కిల్‌కి 6 కిమీ, గన్నవరం ఎయిర్ పోర్టు, ఇన్నర్, ఔటర్ రింగ్ రోడ్ల ప్రక్కన, కంచికచర్ల చ॥ గ॥ 2,900/- నుండి 13,900/- ఇళ్ళ ప్లాట్స్, బ్యాంక్ లోన్ సౌకర్యం కలదు ✆ 93985 76997 [B-44]

Services

BUSINESS SERVICE

■ మీ బంగారం బ్యాంకుల్లో గానీ, మార్వాడి షాప్స్, ఏ ఇతర ఫైనాన్స్‌లలో ఉన్నా మా డబ్బు తో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. ఫోన్: 9100329739 [H-800534]

■ మీ బంగారం మణప్పురం ముత్తూట్, మర్వాడి షాప్స్ ఏ ఇతర ఫైనాన్స్‌లో ఉన్న మాడబ్బుతో విడిపించి మార్కెట్ ధరకు కొనబడును. 9160077916 స్పాట్ క్యాష్ [HA-783417]

BUSINESS OFFER

■ ITR/Salary Slip లేకుండా 48 గంటల్లో హోమ్‌లోన్ పొందడం కష్టం కాదు. Home First మీకు సహాయం చేయడానికి, సలహాలకి కాల్ చేయండి :7406393937 [IA-465]

PERSONAL CARE

CHANGE OF NAME

■ I, Pammi Mounika, W/o. Mr. E Raghava Reddy, aged about 44 years, R/o. H.No.10-10-1 KK Nagar Phase - 2, Near Hanuman Temple, Gandhamguda Hydershahkote, Hyderabad Telangana - 500091. I have changed my name from Emmani Mounika to Pammi Mounika for all future purposes [SCA25004868]

■ I, ADAPA SHILPA RANI W/o Adapa Satish Kumar R/o. H.No:10-2-248, Plot No.171, Street No.5, Road No.6, Near Fresh Super Market, West Marredpally, Hyderabad, Telangana Changed My Name from K.R.SHILPA RANI to ADAPA SHILPA RANI W/o Adapa Satish Kumar for All Purposes [HA-15927]

Wanted

■ Hyd లోని ప్రముఖ Internet సంస్థలో పని చేయుటకు ఎలక్ట్రిషియన్స్ కావలెను. జీ: 20K-30K + Incentives. 2 వీలర్ ఉండాలి. సెల్: 7993463148. [SCA25004827]

■ Wanted Security Guards to work in Twin City Salary. 15,000 to 17,000 + ESI&PF. Age. upto. 35 Yr's Contact : Ph : 9133377645 /44/48 [SCA25004828]

■ 'Plot Ammu Gift Pattu' Immediate Requirement Vacancies- Marketing Directors/ AGM/GM/CEO/Executives/Telecallers/ Digital Mktg Professionals/Receptionist/ PRO's. Note:Attractive Commissions * Exiciting Gifts. *Foriegn Trips. Ph: 8886666913 [HA-4176]

FACULTY TEACHERS

■ Req.teacher's 6th-10th Class social, 1-5 maths & ukg mother Teacher Alpha Model high School Karmangat. Ph: 9292920070 [SCA25004790]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు — జోన్ సెంటర్స్

సాక్షి క్లాసిఫైడ్స్
3+2 3 ప్రకటనలకు చెల్లించండి, 2 ప్రకటనలు ఉచితంగా పొందండి
హైదరాబాద్ సిటీ ఎడిషన్‌లో 5 ప్రకటనలకు రూ. 2280/- (4 లైన్లు), ప్రతి అదనపు లైనుకు రూ. 540/-
గమనిక : జిఎస్టీ మీరు ఇచ్చే అన్ని ప్రకటనలపై 5% GST అదనం

దిల్‌సుఖ్‌నగర్	9912348016	రాజేంద్రనగర్	9010202372
ఎల్.బి.నగర్	9912225475	కూకట్‌పల్లి	9912225476
తార్నాక	9010202751	బాలానగర్	9951602997
సికింద్రాబాద్	9010299013	మల్కాజ్‌గిరి	9505507562
చిక్కడపల్లి	9912225453	మెహదీపట్నం	9912225468
అబిడ్స్	9705144457	చందానగర్	9912225453
అమీర్‌పేట్	9505507563	ఉప్పల్	7095250115

వివరాలకు : 6-2-249/1, సాక్షి టవర్స్, రోడ్ నెం. 1, బంజారాహిల్స్, హైదరాబాద్ - 34
Ph: 040-2325 6000, Ext : 6235 Cell : 9912225453

వేర్వేరు సంఘటనల్లో ఇద్దరి అదృశ్యం



పద్మావతి



కమలమ్మ

మీర్‌పేట: వేర్వేరు సంఘటనల్లో ఇద్దరు మహిళలు అదృశ్యమయ్యారు. సీఐ నాగరాజు కథనం ప్రకారం.. మీర్‌పేట రాఘవనగర్‌కాలనీకి చెందిన నంబూరి పద్మావతి (59) ఈ నెల 9న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఆచూకీ కోసం వెతికినా ప్రయోజనం లేకపోవడంతో ఆమె కూతురు శ్రీవల్లి పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేసింది.

గొడవ పడి..

జిల్లెలగూడకు చెందిన సప్పిడి యాదిరెడ్డి, కమలమ్మ (68)భార్యాభర్తలు. కుటుంబ సభ్యులతో గొడవపడ్డ కమలమ్మ గురువారం ఉదయం ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

10 ప్రైవేటు బస్సుల సీజ్

రవాణా శాఖ అధికారుల తనిఖీలు



బస్సులను తనిఖీ చేస్తున్న రవాణా శాఖ అధికారులు

రాజేంద్రనగర్: పాఠశాలలు పునఃప్రారంభమైన సందర్భంగా గురువారం రవాణా శాఖ అధికారులు ప్రైవేటు బస్సుల తనిఖీలను ప్రారంభించారు. ఉదయం రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అప్పా చౌరస్తా, ఆరాంఘర్ చౌరస్తా ప్రాంతాల్లో రవాణా శాఖ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న 10 బస్సులను గుర్తించి సీజ్ చేశారు. ఉదయమే అధికారుల బృందం ప్రైవేటు బస్సుల తనిఖీని ప్రారంభించారు. ప్రతి బస్సును ఆపి ధ్రువపత్రాలన్నింటినీ పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా తిరుగుతున్న వాహనాలను గుర్తించి వాటిని స్వాధీనం చేసుకోవడంతో పాటు కేసులను నమోదు చేశారు. ఈ తనిఖీల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని అధికారులు వెల్లడించారు.

గ్యాస్ లీకై ప్రమాదం.. ఇద్దరికి తీవ్రగాయాలు

రాజేంద్రనగర్: గ్యాస్ బంక్‌లో వెల్డింగ్ పనులను నిర్వహిస్తుండగా ప్రమాదవశాత్తు గ్యాస్ లీకై ఇద్దరు కార్మికులు తీవ్రంగా గాయపడ్డారు. రాజేంద్రనగర్ పోలీసులు తెలిపిన వివరాలు... అత్తాపూర్ పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నంబర్ 135 వద్ద శ్రీ సిద్ధి వినాయక ఫ్యుయల్ ఇస్సార్ యునీ గ్యాస్ పంపు ఉంది. ఇందులో రెండు గ్యాస్ కంటైనర్లకు గురువారం సాయంత్రం మాధవరావు(48), గోపి(30)లు వెల్డింగ్ చేస్తుండగా ఒక్కసారి పెద్ద శబ్దంతో మంటలు చెలరేగాయి. ఈ సంఘటనలో మాధవరావు, గోపి తీవ్రంగా గాయపడ్డారు. మంటలు చెలరేగడంతో స్థానికులు, వ్యాపారస్తులు, వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు, ఉప్పర్‌పల్లి ఫైర్ సిబ్బంది హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్నారు. గాయాలకు గురైన వారిని ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

నగరంలో కలకలం రేపిన విమాన దుర్ఘటన

బంధువులు, తెలిసిన వాళ్ల కోసం ఆరా

సాక్షి, సిటీబ్యూరో: అహ్మదాబాద్ విమాన దుర్ఘటన అంతటా తీవ్ర కలకలం రేపింది. ప్రమాదానికి గురైన వారిలో తెలిసిన వాళ్లు, బంధువుల కోసం నగరవాసులు ఆరా తీశారు. గుజరాత్‌తో పాటు వివిధ ప్రాంతాలకు చెందిన వారు నగరంలో వ్యాపారరంగంలో పెద్ద సంఖ్యలో స్థిరపడ్డారు.అలాగే ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లోనూ ఉద్యోగాలు చేస్తున్నవాళ్లు ఉన్నారు. ఏదో ఒక విధంగా ఉత్తరాదితో సంబంధ బాంధవ్యాలు కలిగిన నగరవాసుల్లో ఆందోళన నెలకొంది. మరోవైపు 242 మంది ప్రయాణికులు, సిబ్బందితో బయలుదేరిన విమానం కొద్దిసేపట్లోనే నేల కూలిపోయిన సంఘటన ప్రతి ఒక్కరినీ ఎంతో కలచివేసింది. చెట్టుకు ఢీకొట్టి ఒక ఆసుపత్రి భవనంపైన పడిపోవడంతో ఆ ఆసుపత్రిలోని పలువురు డాక్టర్లు, సిబ్బంది సైతం మృత్యువాతపడ్డారు. దీంతో అక్కడి పరిణామాలు, దృశ్యాలను ప్రసారమాధ్యమాలు, సామాజిక మాధ్యమాల్లో చూసి ఆవేదనకు గురయ్యారు. ఇటీవల కాలంలో చోటుచేసుకున్న విమాన ప్రమాదాల్లో ఇదే అతి పెద్ద దుర్ఘటన కావడం శోచనీయం. మరోవైపు ఈ దుర్ఘటనపై సోషల్‌మీడియాలోనూ సమాచారం వెల్లువెత్తింది. దీంతో చాలామంది ప్రమాద దృశ్యాలను, వివరాలను తెలుసుకొనేందుకు సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున సెర్చ్ చేశారు.

గన్ గురిపెట్టి రూ.5 లక్షలు దోపిడీ..

కుత్బుల్లాపూర్: హోల్ సేల్ కిరాణం దుకాణం యజమానిని' గన్ 'తో బెదిరించి రూ. 5 లక్షల నగదుతో పరారైన ఘటన కొంపల్లిలో కలకలం రేపింది. పేట్ బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న ఈ సంఘటనపై మూడు ప్రత్యేక బృందాలు గాలింపు ముమ్మరం చేశారు. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు..కొంపల్లి గ్రామంలో గత కొన్ని సంవత్సరాలుగా లక్ష్మీ కిరాణా జనరల్ స్టోర్ పేరుతో సాయిబాబా, రజిత దంపతులు కిరాణం షాపు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి పదిన్నర సమయంలో దుకాణం మూస్తుండగా ఇద్దరు వ్యక్తులు వాహనంపై వచ్చి గన్ చూపించి చేతిలో ఉన్న రూ. 5 లక్షల నగదు తీసుకొని క్షణాల్లో పరారయ్యారు. వీరితో పాటు దుకాణంలో పని చేస్తున్న పర్వేజ్ వారిని అడ్డుకునే ప్రయత్నం చేయగా తప్పించుకొని మున్సిపల్ కార్యాలయం పక్క సందు నుండి వెళ్లిపోయారు. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయగా ఇన్‌స్పెక్టర్ విజయవర్ధన్, ఎస్ఓటి, సిసిఎస్ పోలీసులు అక్కడికి చేరుకొని స్థానికంగా ఉన్న సీసీ కెమెరాలు పరిశీలించి వారు ఎక్కడికి వెళ్లారు ...! అన్న విషయంపై ఆరా తీస్తున్నారు. ప్రతిరోజు హోల్ సేల్ వ్యాపారం ద్వారా వచ్చే నగదు వివరాలను తెలుసుకున్న తర్వాతే పక్కా ప్రణాళికతో ఈ దోపిడీ వ్యూహరచన చేసినట్లు పోలీసులు భావిస్తున్నారు. గతంలో ఈ దుకాణం లో భారీ చోరీ జరగగా పది లక్షల విలువ చేసే వివిధ రకాల వస్తువులు దొంగతనం చేసి డీసీఎం వాహనం లో తీసుకెళ్లిన ఘటన పోలీసులు అప్పట్లో నిందితులను పట్టుకున్నారు. ఇదే షాపు వ్యాపారిని బెదిరించి నగదుతో ఉడాయించిన నిందితుల కోసం బృందాలుగా విడిపోయి పట్టుకునేందుకు పోలీసులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. విశేషమేమిటంటే సుమారు కిరాణం దుకాణం చుట్టూ రెండు గంటలసేపు మూసివేసే వరకు రెక్కీ నిర్వహించి పథకం ప్రకారం దోపిడీకి రూపకల్పన చేయడం విశేషం. దొంగలు వినియోగించిన వాహనం నంబర్ ప్లేట్ లేకపోవడం... రాత్రి సమయం కావడంతో సీసీ కెమెరాలో స్పష్టమైన ఆధారాలు దొరకకపోవడంతో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధ తాళలేక..

మూసాపేట: అప్పుల బాధ తాళలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. కూకట్‌పల్లి పోలీసులు తెలిపిన వివరాలు... నాగర్‌కర్నూల్‌కు చెందిన టి.వెంకటస్వామి(54) కూకట్‌పల్లి వివేక్‌నగర్‌లో నివాసం ఉంటూ అడ్డాకూలిగా పనిచేస్తున్నాడు. భార్య కూడా దినసరి కూలి. వారి ఇద్దరు కుమారులు ఆటోడ్రైవర్లు. అయితే అప్పులు పెరిగిపోవటంతో వెంకటస్వామి నిత్యం చింతిస్తూ ఉండేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బాత్‌రూంకి వెళ్లి అందులోని యాసిడ్ తాగి బయటకు వచ్చి కింద పడిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి చనిపోయాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొంతు మార్చి.. రూ.రెండు లక్షలు కాజేసి!

- వాట్సాప్ మిమిక్రీతో ఫ్రాడ్ చేసిన సైబర్ నేరగాళ్లు
- లండన్‌లోని స్నేహితుడి పేరిట నగరవాసికి టోకరా

సాక్షి, సిటీబ్యూరో: ఉన్నతాధికారులు, పరిచయస్తులు, స్నేహితులు, బంధువుల ఫొటోలను వాట్సాప్ డీపీలుగా పెట్టుకుని వారి మాదిరిగా చాటింగ్ చేస్తూ డబ్బు కాజేసిన ఉదంతాలు ఇదివరకు అనేకం చూశాం కదా! అయితే ఇప్పుడు సరికొత్తగా 'వాట్సాప్ మిమిక్రీ' ఫ్రాడ్ వెలుగులోకి వచ్చింది. లండన్‌లో నివసిస్తున్న ఓ వ్యక్తి గొంతును సైబర్ నేరగాళ్లు అనుకరిస్తూ నగరానికి చెందిన ప్రభుత్వ ఉద్యోగికి ఫోన్ చేసి రూ.2.05 లక్షలు కాజేశారు. ఈ మేరకు బాధితుడు గురువారం సిటీ సైబర్ క్రైమ్ ఠాణాలో ఫిర్యాదు చేశారు. బాధితుడి(27) స్నేహితుడు కొన్నేళ్లుగా లండన్‌లో విద్యనభ్యసిస్తున్నారు. గత నెల 22న బాధితుడికి +44 7961925094 నంబర్ నుంచి వాట్సాప్ సందేశం వచ్చింది. లండన్‌లో ఉన్న స్నేహితుడు పంపినట్లుగా అది ఉండటంతో బాధితుడు అప్రమత్తం అయ్యాడు. తన స్నేహితుడికి నేరుగా ఫోన్ చేసి సంప్రదించడానికి ప్రయత్నించాడు. అయితే ఆ నెంబర్ అందుబాటులో లేకపోవడంతో సాధ్యం కాలేదు. కొద్దిసేపటికి 8132883688 నెంబర్ నుంచి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు బాధితుడి స్నేహితుడి గొంతును అనుకరిస్తూ మాట్లాడారు. దీంతో తన స్నేహితుడే మాట్లాడుతున్నట్లు బాధితుడు భావించాడు. తాను లండన్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్నట్లు అవతలి వ్యక్తి చెప్పాడు. కొద్దిసేపటికి మళ్లీ ఫోన్ చేసిన నేరగాడు తాను ఢిల్లీ విమానాశ్రయంలో చిక్కుకున్నట్లు తెలిపాడు. తన వద్ద విదేశీ కరెన్సీ ఉండటంతో ఆదాయపు పన్ను అధికారులు అదుపులోకి తీసుకున్నారని చెప్పాడు. కొద్దిసేపటికి కాల్ చేసిన మరో వ్యక్తి ఆదాయపు పన్ను అధికారిగా పరిచయం చేసుకున్నాడు.

క్లియరెన్స్ చార్జీలు చెల్లిస్తే..

రూ.55,500 క్లియరెన్స్ చార్జీలు చెల్లిస్తే స్నేహితుడిని విడిచిపెడతామని సైబర్ నేరగాడు చెప్పాడు. బాధితుడిని నమ్మించేందుకు ఓ నకిలీ రసీదును వాట్సాప్ ద్వారా పంపాడు. తన స్నేహితుడిని రక్షించాలనే ఉద్దేశంతో బాధితుడు ఈ మొత్తం చెల్లించాడు. ఆ తర్వాత మళ్లీ కాల్ చేసిన నేరగాడు మరో పన్ను పేరుతో ఇంకో రూ.1,50,000 బదిలీ చేయించుకున్నాడు. ఆపై మరోసారి కాల్ చేసి రూ.3,50,000 డిమాండ్ చేయడంతో బాధితుడు అనుమానించాడు. తన స్నేహితుడిని అతడి నెంబర్‌కు కాల్ చేసి సంప్రదించాడు. అలా తాను మోసపోయినట్లు తెలుసుకున్న బాధితుడు ఆన్‌లైన్ ద్వారా సిటీ సైబర్ క్రైమ్ ఠాణాను ఆశ్రయించాడు.